


నగరంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్

ఖమ్మం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లేబరేటరీని నగరంలోని పాత డీపీఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఖమ్మంజిల్లాతోపాటు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు ఈ లేబరేటరీ సేవలందిస్తుందని పేర్కొన్నారు. క్రిమినల్ కేసుల్లో పరిశోధన నిమిత్తం శరీరంలోని భాగాలను గతంలో వరంగల్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీకి పంపేవారని, ఇకనుంచి ఖమ్మంలోనే పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

5

శనివారం, 26 అక్టోబరు 2024



కలెక్టరేట్‌లో ప్రసంగిస్తున్న గవర్నర్



ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



అభివృద్ధి, సంక్షేమం

అందరికీ అందాలి

- పర్యావరణ పరిరక్షణకు కృషి జరపండి
- వనజీవి రామయ్య అందరికీ ఆదర్శం
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి
- గిరిజనుల జీవితాలు మెరుగుపడాలి
- మహిళా సాధికారతపైనే భవిష్యత్ అభివృద్ధి
- వనరుల ఆధారంగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఖమ్మం, కొత్తగూడెం కలెక్టరేట్లలో అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో ఇష్టాగోష్ఠి
- రోజంతా ఉత్సాహంగా సాగిన పర్యటన

ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొత్తగూడెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉమ్మడి జిల్లా పర్యటన శుక్రవారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. భద్రాచలంలో రామయ్యను దర్శించుకున్న అనంతరం కొత్తగూడెం, ఖమ్మం కలెక్టరేట్‌లలో ఆయన అధికారులు, వివిధరంగాల ప్రముఖులతో సంభాషించారు. ఇరు జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో చేపడుతున్న అభివృద్ధిని వివరించగా, గవర్నర్ ఆసక్తిగా విన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తన అభిప్రాయాలను విస్పష్టంగా తెలిపారు. మహిళల అభివృద్ధికి కృషి చేయాలని, ఉపాధి అవకాశాలను పెంచాలని సూచించారు. కలెక్టరేట్ల ఆవరణల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ 'ఖమ్మం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం ప్రశంసనీయంగా జరుగుతోంది. అధికారుల పనితీరు అభినంద నీయం... జిల్లాకు మళ్లీ వస్తా... అన్ని పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తా... అప్పట్లోగా పర్యాటక అభివృద్ధి పనులన్నీ పూర్తిచేయండి...' అని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని, ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఫలాలు సమాజంలో ప్రతీ ఒక్కరు పొందేలా ఉండాలని అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మొక్కలు పెంచేందుకు చేస్తున్నకృషిని ప్రశంసంచారు.

జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా అధికారులను, వివిధ రంగాల ప్రముఖులను గవర్నర్‌కు పరిచయం చేశారు. అనంతరం గవర్నర్ అధికారులను, ప్రముఖులనుద్దేశించి ప్రసంగించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అంటూ వనజీవి రామయ్య కృషిని ప్రశంసించారు. రామయ్య వలే తన (మిగతా 6వ పేజీలో)



రామయ్య సన్నిధిలో గవర్నర్

- పూర్ణకుంభంతో ఘనస్వాగతం
- 20 పడకల తలసేమియా వార్డును ప్రారంభించిన గవర్నర్
- ఆ ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలపండి
- పలువురు ప్రజాప్రతినిధుల వినతి

7

గవర్నర్ రాక అభినందనీయం

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఉమ్మడి ఖమ్మంజిల్లా పర్యటనకు గవర్నర్ రావడం అభినందనీయమని ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి అన్నారు. పాలేరు రిజర్వాయర్, బౌద్ధస్థూపం కిన్నెరసాని, కేటీపీఎస్ వంటి పర్యాటక ప్రదేశాలున్నాయని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో అధికారులు ఉత్సాహంగా పనిచేస్తున్నారని ఇద్దరు కలెక్టర్ల నాయకత్వంలో జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో పలు పర్యాటక ప్రదేశాలున్నాయని మరోసారి గవర్నర్ రావాలని ఆహ్వానించారు.



ఆటో డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు

వి.వెంకటరమణ, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి రవాణా అధికారి

ప్రశ్న: ఖమ్మం జిల్లాలో ఎంతమంది ఆటో డ్రైవర్లు ఉన్నారు?

జవాబు: జిల్లావ్యాప్తంగా 15వేల ఆటోలు ఉండగా, ఖమ్మం నగరంలోనే 10వేల ఆటోలు నిత్యం ప్రయాణికులను రవాణా చేస్తున్నాయి. 20 వేలకు పైగా డ్రైవర్లు జీవనోపాధిని పొందుతున్నారు.

ప్ర: రోడ్డు ప్రమాదాల్లో ఆటో ప్రమాదాల సంఖ్య ఎలా ఉంది.?

జ: ఏడాది కాలంగా రోడ్డు ప్రమాదాల్లో ఆటో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎప్పటికప్పుడు ఆటోల ఫిట్‌నెస్‌ను పరిశీలన చేస్తున్నాం. ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నాం.

ఫటాఫట్

ప్ర: ఆటో డ్రైవర్లకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు?

జ: ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక కార్యాచరణ చేశారు. ప్రతి ఆటో డ్రైవర్ ఏడాదికి రూ.500 చెల్లిస్తే రూ.5 లక్షల బీమా వర్తింపు జరిగేలా ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చలు జరుగుతున్నాయి. కంటి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ నమోదుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్ర: ఆటో డ్రైవర్లకు మీరిచ్చే సూచనలు?

జ: ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్ గడువు ముగిసిన వెంటనే రెన్యూవల్ చేయించుకోవాలి. ఆటో ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలను కలిగి ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం

కొత్తగూడెంకు మహర్దశ

- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలతో 'కుడా'

కొత్తగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు జీవో 177ను అందజేశారు. జిల్లాలోని పాల్వంచ గ్రేడ్-2 మునిసిపాలిటీతో పాటు కొత్తగూడెం గ్రేడ్ - 1మునిసిపాలిటీ, సుజాతనగర్ మండలాలకు ఆనుకుని ఉన్న కొంతమేర పట్టణీకరణ ఆనవాళ్లు ఉన్న గ్రామాల అభివృద్ధికి ఈ కుడా దోహదపడుతుంది.

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూపురేఖలకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులు తయారు చేశారు. పరిశీలించిన ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. జిల్లాలో కొత్తగూడెంలో 16.10 చదరపు మీటర్ల పరిధిలోని 36వార్డుల్లో 79,850మంది, పాల్వంచలో 28.38 చదరపు మీటర్ల పరిధిలో ఉన్న 24వార్డుల్లో 80,119మంది, చుంచుపల్లిలో 8.50 చదరపు మీటర్ల పరిధిలోని 19,994మంది, సుజాతనగర్‌లో 28.47 చదరపు మీటర్ల పరిధిలోని 10,654మందితో కలిపి మొత్తం 81.45 చదరపు మీటర్ల పరిధిలోని ప్రాంతాలను కలుపుతూ 15 అక్టోబరు 2024 తేదీన జీవో 177 ద్వారా కొత్తగూడెం అర్బన్ అథారిటీ 'కుడా'గా రూపాంతరం చెందింది.



వర్గీకరణ అమలు జరిగే వరకు పోరాటం

- మాదిగల ధర్మయుద్ధం సభల నిర్వహణ
- ఖమ్మం నుండే పోరాటానికి నాంది
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- నగరంలో మాదిగల ధర్మయుద్ధం మహాసభ

6



మాలల జోలికొస్తే చూస్తూ ఊరుకోం

- దళితులకు రాజ్యాంగ అధికారం దక్కకూడదనే వర్గీకరణ కుట్ర
- కృష్ణమాదిగ మనువాదుల ఏజెంటుగా మారాడు
- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- మహా పాదయాత్ర షురూ

6

భద్రాచలానికి ఉరేసినట్టు చేశారు..

- ఐదు పంచాయతీల సాధనకోసం ముమ్మర ప్రయత్నం
- టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్




భద్రాచలం రామాలయంలో ఎమ్మెల్సీ కోదండరామ్

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఊరికి ఉరేసినట్టుగా భద్రాచలం చుట్టూ ఉన్న గ్రామపంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని, ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరు లేవనెత్తుతున్నారని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. భద్రాచంలో శుక్రవారం రామాలయ సందర్శన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై చాలాసార్లు కేంద్ర హోంమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో చాలాసార్లు విన్నవించటం జరిగిందన్నారు. అయినప్పటికీ ఆ ప్రధాన సమస్యకు ఎటువంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్య ఎంతో ఇబ్బంది కలిగిస్తోందన్నారు. ఈ అవరోధం తొలగించకుండా భద్రాచలం పట్టణ అభివృద్ధికి న్యాయం చేయటం అసాధ్యమన్నారు. ఈ విషయమై (మిగతా 6వ పేజీలో)

నిండాముంచిన అత్యాశ

- ఆర్‌జేపీ యాప్ పేరుతో కుచ్చుటోపీ
- రూ.15వేల పెట్టుబడి పెడితే రోజుకు రూ.540
- ఏడాది పాటు వస్తాయని నమ్మించి గాలం
- ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టిన సుమారు 120 మంది
- మూడు రోజులుగా పనిచేయని యాప్
- లబోదిబోమంటున్న రాఘవాపురం వాసులు

సుజాతనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసం బారిన పడి రూ. లక్షల్లో మోసపోయిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. కొద్ది రోజులుగా గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం గత మూడు రోజులుగా ఆన్‌లైన్‌లో ఆ యాప్ కనబడకపోవడంతో బయటకు తెలిసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్‌జేపీ అనే మార్కెటింగ్ యాప్‌లో రూ.15 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజూ రూ.540 చొప్పున ఏడాదిపాటు ఖాతాలో జమవుతాయని కొందరు ప్రచారం చేశారు. యాప్‌లో జాయిన్ చేస్తే, చేసిన సభ్యుడికి రూ.8 వేల నుంచి రూ. 9వేల వరకు వస్తాయని నమ్మించారు. కొందరు ఖాతాల్లో ఇలా యాప్ నుంచి నిరాటంకంగా డబ్బులు పడుతుండటంతో రాఘవాపురం గ్రామం నుంచి సుమారు 120 మంది యాప్‌లో పెట్టుబడి పెట్టారు.



కొంతమంది తాము జాయిన్ కావడమే కాక తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరుతో కొన్ని యాప్‌లో పెట్టుబడి పెట్టారు. గత నాలుగు రోజులుగా యాప్ కనబడకపోవడంతో అంతా నిరాశకు గురయ్యారు. బుధవారం కొందరి అకౌంట్లో డబ్బులు ఆన్‌లైన్‌లో కనిపించినా ఆ మొత్తం ఆ సభ్యుడు ఖాతాకు మళ్లించాలంటే మరో రూ.3500 చెల్లించాలని తెలపడంతో అలా యాప్‌లో కనబడిన అధిక మొత్తం డబ్బులు చూసి ఆశతో అవి కూడా చెల్లించారు. అవి చెల్లించిన మరుసటి రోజు నుంచి యాప్ మొత్తం కనబడక పోవడంతో మోసపోయామని గ్రహించిన సదరు బాధితులు, ఈ యాప్‌ను మొదటగా పరిచయం చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయటానికి సిద్ధం అయినట్లు సమాచారం. యాప్‌లో పెట్టుబడి పెట్టిన తమ డబ్బులు వస్తాయో, రావో అని బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధిలంతా ఒకే ఊరు వారు కావడం గమనార్హం.

పోలీసుల తీరు అప్రజాస్వామికం

- బీఆర్ఎస్ నాయకుడు పుల్లయ్యపై కేసు అన్యాయం
- పరామర్శించిన వారిని అరెస్టు చేస్తారా...?
- బీఆర్ఎస్ నేతలు తాతా మధు, సండ్ర, కొండబాల
- కన్నీటి పర్యంతమైన గూని ప్రసాద్ కుమార్తెలు
- ఖండించిన ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ నామా

ఖమ్మం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గతంలో ఎన్నడూ లేని విధంగా ఖమ్మం జిల్లాలో పోలీసులు అప్రజాస్వామ్య పద్ధతిలో కేసులు పెడుతున్నారని, పోలీసు చర్యలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం సాగిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో సంయుక్తంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ చింతకాని మండల అధ్యక్షుడు పుల్లయ్యను అరెస్టు చేయడం బాధాకరమని, విద్యుత్ షాక్‌తో మరణించిన ప్రసాద్ అనే రైతు మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని పరామర్శించినందుకు పుల్లయ్యపై హత్యాయత్నం కేసు పెట్టడం దారుణమన్నారు. జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధిగా ఖమ్మం సీపీని వివరణ అడిగితే కనీసం సమాధానం కూడా ఇవ్వలేదని అన్నారు. చనిపోయిన రైతు కుటుంబాలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించి న్యాయం చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ పని చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీమాజీ చైర్మన్ (మిగతా 6వ పేజీలో)

పోలీసుల తీరు అప్రజాస్వామికం

(5వ పేజీ తరువాయి)

లింగాల కమల్‌రాజ్‌లు మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపినంత మాత్రాన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బెదరరని అన్నారు. తప్పుడు కేసులపై చట్టపరంగా పోరాడతామన్నారు.

తప్పుడు కేసులు పెట్టి బాధించకండి

తమ కుటుంబాన్ని పరామర్శించిన వారిని అరెస్టుచేయడం అన్యాయమని, తమ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించిన రైతు ప్రసాద్ కుమార్తెలు సునిత, కళ్యాణిలు ప్రెస్‌మీట్‌లో కన్నీటిపర్యంతో ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు పుల్లయ్యపై తప్పుడు కేసులు పెట్టారని, ఆ రోజు జరిగిన ఆందోళనలో ఆయన లేరని తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకులను లొంగదీసుకోలేరు

బెదిరింపు చర్యలతో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను లొంగదీసుకోలేరని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. చింతకాని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పుల్లయ్యపై అక్రమంగా కేసు పెట్టి అరెస్టు చేయడం ద్వారా అధికార పార్టీ నేతలు బెదిరింపు చర్యలు పాల్పడుతున్నారని ఆరోపించారు. పుల్లయ్య అరెస్టు సందర్భంగా మహిళలపట్ల అనుచితంగా ప్రవర్తించిన వైరా పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న పుల్లయ్య అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మాజీ ఎంపీ నామా నాగేశ్వరావు ఓ ప్రకటనలో తెలిపారు. కక్షసాధింపు చర్యలకు అధికారపార్టీ నేతలు పాల్గొనడం సరికాదన్నారరు.

రాజకీయాల్లో అధికారం శాశ్వతంకాదని, ప్రజల హక్కుల కోసం పోరాడేవారిని అరెస్టుచేయడం తగదన్నారు. పుల్లయ్యపై పెట్టిన తప్పుడు కేసులు వెంటనే ఎత్తివేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు



మలేసియా పర్యటన ముగించుకొని శుక్రవారం రాత్రి హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి తుమ్మలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు చావా నారాయణరావు, కమర్తపు మురళి, సైదాబాబు, పోట్ల వీరేందర్, నల్లమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం రికార్డుల పరిశీలన

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా సాగుతున్న న్యాక్ బృందం పరిశీలన శుక్రవారంతో పూర్తైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి తెలిపారు. కళాశాల రికార్డులను, కళాశాల ప్రాంగణం, భవనాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన టీఎస్‌కేసీ విభాగం చైర్మెన్ డాక్టర్ పురుషోత్తం నాయక్, కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రకాలయం, మెంబర్ జోస్ ఎలు పరిశీలన వివరాలను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కృష్ణవేణి, జానకి, రామారావు, రాకేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వివరాలను సీల్డ్ కవర్లో ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న న్యాక్ బృందం

ఊరికి ఉరేసినట్టుగా భద్రాద్రి

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రకటన చేసి ఉన్నారని, ఈ క్రమంలో మరోసారి ఈ ఐదు పంచాయతీల సాదన కోసం ముమ్మర ప్రయత్నం చేయాలని ఇందుకు తాను అంకితభావంతో కృషి చేస్తానని కోదండరాం అన్నారు.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపు నుంచి భద్రాద్రిని రక్షించేందుకు కరకట్టల ఎత్తు పెంచి పటిష్టం చేయాలన్నారు. బ్యాక్‌వాటర్ ప్రభావం అధ్యయనం చేయకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నారని సమస్యకు పరిష్కార మార్గం వెతకాలని ఎమ్మెల్సీ అన్నారు. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి సవ్యంగా లేకపోవటంతో ఇబ్బందిగా ఉందని ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదించటం జరుగుతుందన్నారు. చర్లలో డిగ్రీ కళాశాల కావాలని స్థానికులు కోరుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. భద్రాచలం గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు వేరువేరుగా భోజనశాలను నిర్మించాలని, దీని వల్ల సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో టీజేఎస్ ఉమ్మడి జిల్లా నాయకులు గోపగాని శంకరరావు, మల్లెల రామనాధం, తిప్పన సిద్దులు, పూనెం ప్రదీప్ఎకుమార్, రేపాక రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాగా ఆదివాసీ, బీసీ సంఘాల నాయకులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఇదిలా ఉండగా సేవ్ భద్రాద్రి తరుపున పాకాల దుర్గాప్రసాద్, ఎస్కే అజీమ్‌లు ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానించారు. అలాగే ఇతరులు సైతం ఆయనను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు భద్రాచలంలోని శ్రీసీతా రామచంద్రస్వామి వారిని కోదండరాం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈవో భవానీ రామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు పోరాటం

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ఖమ్మంటౌన్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలుచేయడంలో తీవ్ర జాప్యం చేస్తోందని, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఎస్సీవర్గీకరణ అమలుజరిపే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. శుక్రవారం రాత్రి ఖమ్మంలో జరిగిన ఉమ్మడి జిల్లా మాదిగల ధర్మయుద్ధసభలో ఆయన మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకోసం ఖమ్మంనుండే పోరాటం మొదలు పెడుతున్నామన్నారు. ఈనెల 30వతేదీ వరకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ధర్మయుద్ధ సభలు నిర్వహిస్తామని వచ్చే నెల 16న రథయాత్ర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. డిసెంబరు 21న ఛలో హైదరాబాదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.వర్గీకరణ అమలు జరిగేంతవరకు జరిగే ఆందోళనలు, నిరసన దీక్షలు కార్యక్రమాల్లో మాదిగలు కుటుంబసమేతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గతంలో రిజర్వేషన్ల కోసం అంబేద్కర్ పోరాడితే అగ్రవర్ణాలు దానిని వ్యతిరేకించాయన్నారు. తర్వాత వారి మధ్య ఒప్పందం జరిగి రిజర్వేషన్లకు అంగీకరించారన్నారు. ప్రస్తుతం పరిస్థితి మారి మాలలు మాదిగలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని, దానికి సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు ఇస్తున్నాడన్నారు. 1999లో ఎస్సీ వర్గీకరణ కోసం మాలమహానాడు, మాదిగ దండోరా సంఘాలు సమావేశం అయ్యాయని, మాదిగల తరుపున తాను, మాలల తరుపునపీవీరావు పాల్గొని అప్పటి రాష్ట్రపతి ఆర్‌కే నారాయణన్ చెప్పిన నిర్ణయాన్ని అమలుచేద్దామని సంతకాలు చేశామన్నారు. అందులో ప్రస్తుత ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆయన సోదరుడు మల్లు రవి కూడా సంతకాలు చేశారని మంద కృష్ణ వివరించారు. అయితే అప్పటి రాష్ట్రపతి ఎస్సీ వర్గీకరణచేయాలని పేర్కొన్నా మాలలు దానిని వ్యతిరేకించారన్నారు. తమ పలుకుబడి ఉపయోగించి వర్గీకరణను రద్దుచేయించారన్నారు.

తర్వాత 30 ఏళ్ల పోరాటం చేసిన ఫలితంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా సీఎం రేవంత్‌రెడ్డి దీనిని అమలుచేయడంలేదన్నారు. దీనివల్ల మాదిగలకు ఉద్యోగ నియామకాలలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, మాదిగల నోటికాడ కూడును మాలలకు అందిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీవర్గీకరణ అమలు చేసే మొదటిరాష్ట్రంగా తెలంగాణా ఉంటుందని ప్రకటించిన రేవంత్‌రెడ్డి మాలలతో కుమ్మక్కు కావటం వల్లనే అమలుకు తీవ్రజాప్యం చేస్తున్నారన్నారు. మాలలకు వ్యతిరేకంగా పనిచేస్తే పదవి కోల్పోవలసివస్తుందని రేవంత్‌రెడ్డికి భయం ఉందని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాల సామాజిక వర్గానికి చెందినవారు కావటమే దీనికి కారణమన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయకపోవటంతో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వర్గీకరణ రద్దుకు భద్రాచలం నుండి హైదరాబాదుకు మాలలు పాదయాత్ర చేస్తున్నా వారికి సమాజ పరంగా మద్దతులేదన్నారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పీఎస జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్‌మాదిగ అధ్యక్షతన వహించిన ఈసభలో నాయకులు తూరుగంటి అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వర్లు, ఏపూరి వెంకటేశ్వరరావు, నరసయ్య, ఇషాక్, వెంకన్న, సోమయ్య, భవాని, న్యాయవాది మేకల సుగుణారావు పాల్గొన్నారు.



మంద కృష్ణను సన్మానిస్తున్న మహిళా నాయకులు

అటవీ అధికారుల అక్రమాలు

- ఒకే వారంలో నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్, వాటరింగ్, షిఫ్టింగ్
- సామాజిక తనిఖీలో బట్టబయలు

కామేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కలు పెంచి అడవుల్లో నాటాలని ఎంతో ఖర్చు చేసి నర్సరీలను ఏర్పాటు చేసింది. కానీ ఆశాఖలో పని చేస్తున్న అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని సామాజిక తనిఖీలో బయట పడింది. కామేపల్లి మండలం ఊట్కూర్ గ్రామంలో 15వ సామాజిక తనిఖీ సంబంధించిన గ్రామసభను ఏర్పాటు చేశారు. 2020వ ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ ఊట్కూర్‌లో నర్సరీను ఏర్పాటు చేసింది. గత ఏడాది జరిగిన సామాజిక తనిఖీ బృందానికి అటవీ శాఖ అధికారులు తనిఖీ కోసం రికార్డులను అప్పగించలేదు. దీంతో ఈఏడాది ఉన్నాతాధికారులు రికార్డులు సామాజిక తనిఖీ బృందం వారికి అప్పజెప్పాలని ఆదేశాలు రావడంతో వారికి ఇచ్చారు. ఆరికార్డుల్లో పలు విషయాలు గ్రామ సభలో ప్రజల ముందు వివరించారు. 2020 జనవరి నెలలో నర్సరీని ఏర్పాటు చేశారు. అయితే అటవీ శాఖ అధికారులు ఎంబీల్లో ఒకే వారంలో బ్యాగులను నింపడం, వాటరింగ్ చేయడం, కలుపు తీయడం, షిఫ్టింగ్ చేయడం గమనార్హం. ఎంబీల్లో ఒకే వారంలో జరిగినట్లు నమోదు చేశారు. అసలు ఒక వారంలోనేపే అన్ని పనులు ఎలా చేశారని గ్రామ సభలో ప్రజలు ప్రశ్నించారు. అయితే నర్సరీలో మొత్తం ఉన్నది 134 బెడ్లు కానీ వాటరింగ్ చేశామని 749బెడ్లకు, కలుపు తీశామని 310 బెడ్లకు, షిఫ్టింగ్ చేశామని పేర్కొంటూ 382 బెడ్లకు రూ.213179 పేమెంట్లు చేశారు. ఉన్న బెడ్ల కంటే అధిక బెడ్లకు పెమెంట్లు చేయడంతో అందరు ఆశ్చర్యానికి గురయ్యారు.అంతేకాండు రెండు పనులకుగాను ఇద్దరు, ముగ్గురు సంతకాలతో మస్టర్లలో రూ.628104 పేమెంట్లు చేయడం గమనార్హం. ఈజీఎస్ పనులకు సంబంధించి ఎవెన్యూ ప్లాంటేషన్‌లో 390 మొక్కలకు గాను 46మొక్కలు మాత్రమే బతికి ఉన్నాయి. 15వేల మొక్కలకు రిజిస్టర్లు లేవు. ఈ గ్రామ సభకు పంచాయతీ కార్యదర్శి రవి గైర్హాజరు అయ్యారు. ఫాతిమా అనే ఓ మహిళకు ఇంకుడుగుంతకు పేమెంట్ రూ.5114 పంచాయతీ ఖాతాలో పడిన ఇంతవరకు లబ్ధిదారురాలికి ఇవ్వలేదు. ఈ గ్రామ సభలో ఎస్‌ఆర్‌పీ సాంబశివచారీ, డీఆర్‌పీలు శ్రీను, రవి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీఏలు భాస్కర్, డేవిడ్‌రాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్యా, గ్రామస్థులు పాల్గొన్నారు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మాలల జోలికొస్తే చూస్తూ ఊరుకోం...

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దళితులకు రాజ్యాంగ అధికారం దక్కకూడదనే కుట్రతోనే ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరగలేదని, న్యాయస్థానాలు మనువాదుల జేబు సంస్థలుగా మారాయని ఆయన ఆరోపించారు. భద్రాచలంలో శుక్రవారం అంబేద్కర్ సెంటర్లో మాలల మహాపాదయాత్ర ప్రారంభమైంది. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో న్యాయస్థానాలు రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం ఉండేదని, కాని మనువాదుల పాలనలో బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కులాలు, ఉప కులాలను వర్గీకరించడం జరుగుతోందని విమర్శించారు. న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో అమలు సాధ్యమా! అసాధ్యమా!! పరిశీలించకుండా వర్గీకరణ వెంటనే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా ప్రకటించడాన్ని సుధాకర్ తప్పుపట్టారు. రాష్ట్రంలో మాదిగలు మాలలు జనాభాపరంగా సమానంగా ఉన్నారని అయినప్పటికీ మాలలను తక్కువగా చేసి చూపుతున్నారని వాపోయారు. ఏ రీతిన వర్గీకరణ చేపడుతుందో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. దొరల పాలన పోయి ప్రజా పాలన రావాలని తామంతా కాంగ్రెస్ గెలుపు కోసం ఎంతో కష్టపడ్డామన్నారు. ఇంకెంత కాలం మాలలను అణిచివేస్తారు? ఖబర్దార్ మాలల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని సుధాకర్ హెచ్చరించారు.

కృష్ణ మాదిగ మనువాదుల ఏజెంట్‌గా మారాడని, ఎమ్మార్పీఎస్ మోదీ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. మోదీ, రేవంత్‌లను తరిమికొట్టేందుకు మాలలు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి నుంచి హైదరాబాద్ వరకు తాము నిర్వహిస్తున్న పాదయాత్ర మనువాదులు వర్గీకరణ వాదులు వర్గీకరణ వాదుల గుండెల మీద నడుచుకుంటూ వెళ్లే యాత్రని అన్నారు. అంతకు ముందు బుద్ధవందనం ప్రార్ధన నిర్వహించగా జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ జెండా ఊపి మహాపాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర భద్రాద్రిలో శుక్రవారం ప్రారంభం కాగా 38 రోజుల్లో 16 జిల్లాలు, 35 నియోజకవర్గాల్లో కొనసాగి ఆగస్టు ఒకటిన హైదరాబాద్ చేరుకోనుంది. ఈ సందర్భంగా నిర్వహించే మాలల మహాసంగ్రామ సభతో యాత్ర ముగియనుంది.

అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందాలి...

(5వ పేజీ తరువాయి)

కెరీర్ కూడా పర్యావరణ వేత్తగానే ప్రారంభించానని గుర్తుచేశారు. ఖమ్మంజిల్లా ప్రాముఖ్యత, సంస్కృతి, సాంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటుచేయడం బాగుందని, ప్రతీ ఇంటిలోను మొక్కలు పెంచాలని కోరారు. ఖమ్మంజిల్లాను పర్యాటకకంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలున్నాయని, చార్‌ధామ్ యాత్ర వలే ఖమ్మంజిల్లాలోని బౌద్ధస్థూపం అభివృద్ధి చెందితే ఎంతో మంది పర్యాటకులు బౌద్ధస్థూపాన్ని తిలకించేందుకు వస్తారని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన ఎడ్యుకేషన్ టూర్ కార్యక్రమం కూడా విద్యార్థుల్లో ఎంతో అవగాహన పెంచుతుందని, రాష్ట్రవ్యాప్తంగా పిల్లల ఎడ్యుకేషన్ టూర్ నిర్వహించాల్సి ఉందన్నారు. ఖమ్మంజిల్లాలో పురావస్తు ప్రదేశాలు, పర్యాటక ప్రదేశాలు బాగా ఉన్నాయని, దేవాలయాలు ఆధ్యాత్మికతను పెంచుతాయని, వీటిన్నింటిని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఖమ్మంజిల్లా అభివృద్ధిలో సాంస్కృతిక చైతన్యంలో అధికారులు చేస్తున్న కృషిలో ప్రజాప్రతినిధులు, కవులు, కళాకారులు భాగస్వామ్యం కావాలన్నారు. మరోసారి జిల్లాకు వస్తానని, జిల్లాలోని ప్రముఖులను కలవడంతోపాటుపర్యాటక ప్రదేశాలను పరిశీలిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఇంకా ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపైనే భవిష్యత్ అభివృద్ధి

భద్రాద్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన సమావేశంలో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తొలుత కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని ప్రశంసించారు. 2021లో 73శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్వయం సహాయ మహిళా సంఘాల కార్యక్రమాలు, ఆదివాసీ గిరిజన మహిళలు తయారు చేసిన వంటకాలు బాగున్నాయని ప్రశంసించారు. భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారతపై ఆధారపడి ఉందని, ఈ విషయం తాను కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాల్స్ సందర్శన సందర్భంగా గుర్తించానని చెప్పారు. మహిళల చేతుల్లో డబ్బు ఉన్నప్పుడు ఆర్థిక సాధికారత వస్తుందన్నారు. జిల్లాలో నదులు, అటవీ సంపదతోపాటు బీపీఎల్, కేటీపీఎస్, జెన్కో, భారత్ జలనీటి శుద్ధి కర్మాగారం, సింగరేణి గనులు ఉన్నాయని, నిరుద్యోగులైన అన్నివర్గాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే జీవనోపాధి పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. భద్రాచలం, పర్ణశాలలోని సీతారామ చంద్రస్వామి దేవాలయాల పరంగా పర్యాటక శాఖను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని సూచించారు. మారుమూల ప్రాంత కొండరెడ్ల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన పలువురు ప్రముఖులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, న్యాయవాదులు వారి వారి రంగాల్లో చేసిన కృషిని రాష్ట్ర గవర్నర్‌తో పంచుకున్నారు. అంతకుముందు గవర్నర్‌కు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్ తదితరులు స్వాగతం పలికారు. తొలుత గవర్నర్ కలెక్టరేట్ ఆవరణలో వివిధశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, జిల్లా అధికారులు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న గవర్నర్

ఈసీజీ.. ఇక్కట్లు

- జిల్లా ఆస్పత్రిలో పనిచేయని మిషన్లు
- రోగులకు తప్పని తిప్పలు



ఈసీజీ మిషన్ గది వద్ద రోగులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఓ 68 ఏళ్ల వృద్ధుడు శుక్రవారం జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. ఛాతీలో నొప్పితో వైద్యులకు చూపించుకుంటే ఈసీజీ తీయించుకురండి అంటూ చెప్పారు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈసీజీ పనిచేయడం లేదంటూ ఓపీ స్లిప్‌పైనే అక్కడి సిబ్బంది రాసిచ్చారు. దీంతో ఆ స్లిప్‌తో తిరిగి వైద్యుని వద్దకు వెళ్లి ఈసీజీ పనిచేయడం లేదంటూ వైద్యునికి చెప్పగా తామేం చేయాలంటూ ఆ రోగితో వాదనకు దిగారు వైద్య సిబ్బంది. తనకు తీవ్రమైన నొప్పి లేస్తుందంటూ ఆ రోగి ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పుకోండి.. అంటూ దురుసుగా సమాధానం చెప్పారు.. దీంతో ఆ రోగి ఆస్పత్రికి చెందిన ఆర్‌ఎంవోకు ఫిర్యాదు చేశారు. అప్పుడు వెంటనే ఉన్న ఒక్క మిషన్‌పై ఈసీజీని తీసి పంపించారు. ఇదీ జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలకు ఓ ఉదాహరణ..

గత కొద్దిరోజులుగా జిల్లా ఆస్పత్రిలో ఈసీజీ మిషన్లు పనిచేయడం లేదు. కార్డియాలజీ, ఈసీజీ విభాగం, క్యాజువాలిటీ, ఎంసీహెచ్, ఐసీయూ, ఎక్స్‌రే ప్లాంటు, ఇలా మొత్తం ఏడు ఈసీజీ మిషన్లు ఉన్నాయి. వీటిలో కార్డియాలజీ, క్యాజువాలిటీలో తప్ప ఉన్న మిషన్లన్నీ పాడైపోయాయి.

మలిదశ ఉద్యమంలో సంజీవయ్య పాత్ర కీలకం

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- ఘనంగా ఎస్ఈ సంజీవయ్య ఆత్మీయ సన్మానం

పాల్వంచ, అక్టోబరు 25: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎస్ఈ సంజీవయ్య పోషించిన పాత్ర కీలకమైనదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేటీపీఎస్ 5,6 దశల్లో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న కాటం సంజీవయ్య ఈ నెలలో పదవీ విరమణ చేస్తున్న సందర్భంలో ఆయన అభిమానులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్లో శుక్రవారం ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మేళతాళాలతో, టపాసుల సందడితో, ఊరేగింపుతో సంజీవయ్య అభిమానులు ఆయణ్ను సభా స్థలికి తీసుకొనివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులు, కార్మికులు, ఉద్యమకారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సంజీవయ్యను పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎస్ఈ సంజీవయ్య మృదు స్వభావి అని, అందరితో కలిసిపోయే మంచి మనస్తత్వమున్న నాయకుడని అన్నారు. ఉద్యమ సమయంలో ఉద్యమాన్ని ముందుండి నడిపిన తీరు అద్వితీయమన్నారు. ఆయన నడవడిక ఇతర కార్మికులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం, ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో సంజీవయ్య చొరవ తీసుకుని కార్మికులను అందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి జెన్‌కో వ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు, ఇంజనీర్లలో ఉద్యమ స్ఫూర్తిని నింపి ఉద్యమానికి ఊపిరి పోసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, 5,6దశల సీఈ ప్రభాకరరావు, సీఈ మూర్తి, టీపీసీసీ సభ్యులు నాగసీతారాములు, ఏఐటీయూసీ నాయకులు సుధాకర్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి చారుగుండ్ల రమేష్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, సంజీవయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సంజీవయ్యను సన్మానిస్తున్న కార్మికులు, ఇంజనీర్లు

ప్రశాంతంగా ముగిసిన గవర్నర్ పర్యటన

బూర్గంపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సాయంత్రం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేసి శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గవర్నర్ పర్యటన విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

రామయ్యను దర్శించుకున్న గవర్నర్


రామాలయంలో గవర్నర్


వరివట్టం కట్టి స్వాగతం పలుకుతున్న అర్చకులు

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గవర్నర్ ఆలయంలో మూలవరుల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీతాయారు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా. గవర్నర్‌కు వేద ఆశీర్వచనాన్ని వేదపండితులు అందజేయగా ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సమయంలో దేవస్థానం తరపున పట్టువస్త్రాలను దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, శ్రీసీతారామచంద్రస్వామి చిత్రపటాన్ని, స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి గవర్నర్‌కు అందజేశారు. కాగా భద్రాద్రి క్షేత్ర ప్రాశస్త్యాన్ని వైదిక సిబ్బంది గవర్నర్‌కు వివరించారు.

తలసీమియా వార్డు ప్రారంభం

భద్రాచలంలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వార్డును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించారు. మొత్తం 20 పడకలతో ఉండే ఈ వార్డును గవర్నర్ నిధుల నుంచి రూ.16లక్షలతో ఏర్పాటుచేయగా.. గవర్నర్ ప్రారంభించారు. భద్రాచలంలో వైద్య సేవలను అభివృద్ధి పరిచేందుకు కేంద్రం నిధుల నుంచి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చేందుకు చూడాలని రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు ప్రతిపాదనలు అందజేయగా అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలో 21ఏళ్లుగా తలసీమియా


గవర్నర్ చిత్రాన్ని గీసి అందజేస్తున్న చిత్రకారుడు రాజేష్

వ్యాధితో బాధపడుతున్న వెంకటరావమ్మ, ఇందు, సంపత్, ప్రవర్మ, కార్తికేయలకు దుస్తులు బహుకరించారు. అలాగే రక్తనిధి కేంద్రాన్ని సందర్శించి తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరికరాలు అందజేస్తున్న ఐటీసీ పీఎస్‌పీడీ సంస్థను అభినందించారు. గవర్నర్ రాకను పురస్కరించుకుని భద్రాచలంలో రామాలయం పరిసరాలు, గవర్నర్ పర్యటించే మార్గంలో ఉన్న దుకాణాలను పోలీసు అధికారుల ఆదేశాలతో మూసివేశారు.

ఆ ఐదు పంచాయతీలను కలపండి

భద్రాద్రి అభివృద్ధికి కీలకమై ఏపీలో విలీనమైన ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో కలిపేవిధంగా చూడాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు కోరారు. భద్రాచలం పర్యటనకు వచ్చిన గవర్నర్‌ను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య కలిసి ఐదు పంచాయతీలు తిరిగి భద్రాద్రిలో కలిసేలా చూడాలని కోరారు. అలాగే భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కలిసి భద్రాద్రి ఆలయ అభివృద్ధికి సహకరించాలని, ఎటపాక, గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలని కోరారు. అదేవిధంగా గిరిజన న్యాయ కళాశాలను భద్రాచలంలో ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీలోని వివిధ సమస్యలను పరిష్కరించేందుకు సహకారం అందించాలని మహబూబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కోరారు.


పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్


చిన్నారులతో ముచ్చటిస్తున్న దృశ్యం

ఖమ్మంలో బిజి బిజీగా గవర్నర్


వివిధ రంగాల ప్రముఖులతో మాట్లాడుతున్న గవర్నర్



ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ఆసక్తిగా తిలకించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై, వివిధ శాఖల ద్వారా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, స్టాల్స్ తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వివిధ శాఖల ద్వారా ఖమ్మం జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు. పర్యాటక ప్రదేశాలపై సమాచార శాఖ, జిల్లా పర్యాటక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ గవర్నర్ పరిశీలించారు. జిల్లాలోని జాఫర్ బావి, ఖమ్మం ఖిల్లా, లకారం లేక్ సస్పెన్షన్ బ్రిడ్జి, వైరా లేక్, పాలేరు రిజర్వాయర్, బోటింగ్, నేలకొండపల్లిలోని బుద్ధ స్తూపం, జమలాపురం వేంకటేశ్వరస్వామి టెంపుల్, కూసుమంచి శివాలయం, కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్ పర్యాటక ప్రదేశాల వివరాలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్ లో పంట రుణమాఫీ, డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు, సేంద్రీయ వ్యవసాయం, హెల్త్ బెనిఫిట్స్ ఆఫ్ మిల్లెట్స్, ఆయిల్ పామ్ మొక్కల పెంపకం, రైతులకు కలిగే ప్రయోజనాలు తెలుపుతూ ప్రదర్శించిన వాటిని గవర్నర్ పరిశీలించి అభినందించారు. గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వొకేషనల్ ట్రైనింగ్ శిక్షకులు, విద్యార్థినులు తయారు చేసిన చేతివృత్తులను, ఇందిరా మహిళా శక్తి వారి చాగంటి లావణ్య మిల్లెట్ స్నాక్స్, సంచార విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల ప్రదర్శనను గవర్నర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్డీవో సన్యాసయ్య, డీఈవో సోమశేఖర శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

జిల్లాకు చేరుకున్న ఆయన మధ్యాహ్నం 2గంటలకు ఎన్నెస్పీ అతిథిగృహానికి చేరుకున్నారు. ఆయనకు అక్కడ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం గవర్నర్ మధ్యాహ్న భోజనం ముగించుకుని కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

అభివృద్ధిని వివరించిన కలెక్టర్

ఖమ్మం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ఎంతో చారిత్రక సంపద ఉన్న జిల్లా అని, పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక దేవాలయాలున్నాయని, వాటి చరిత్రను వివరించారు. స్తంబాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, ఖమ్మంఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధస్తూపం, జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, పులిగుండాల అటవీప్రాంతంలోని యూకో టూరిజం గురించి వివరించారు. జిల్లాలో ప్రభుత్వ శాఖల వారీగా చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెరుగుపరిచేందుకు విద్యార్థుల్లో ఆంగ్లభాష నైపుణ్యం పెంచేందుకు ఆయిల్‌పామ్ అభివృద్ధికి తీసుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. ఖమ్మంఖిల్లాను రూ.30కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రోప్‌వే కూడా నిర్మిస్తున్నామని తెలిపారు.

జిల్లాలో అంటువ్యాధులు గతంలో అధికంగా నమోదయ్యాయని, వాటిని క్రమంగా తగ్గించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యపరీక్షల కోసం డయాగ్నస్టిక్ హబ్ ఏర్పాటుచేశామని, ఖమ్మం జిల్లాలో క్యాన్సర్‌వంటి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా రూ.31కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయని, 50 పాఠశాలలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుచేశామని వివరించారు. జిల్లాలో మిర్చి సాగు అధికంగా ఉందని, చిల్లింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని, లైంగిక వేధింపులు, డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన కలిపిస్తున్నామని తెలిపారు. ఇటీవల మున్నేరు వరదల కారణంగా 50వేల మంది ప్రజలు వరద ప్రభావానికి గురయ్యారని, 38 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, దెబ్బతిన్న ఇళ్లకు పంటలకు పరిహారం సకాలంలో అందించామని తెలిపారు. మధిర నియోజకవర్గంలో ఇందిర మహిళ డెయిరీ ఏర్పాటు చేశామని, 20వేల మందితో మహిళ సంఘాలు ఏర్పాటుచేసి పాల వ్యాపారం చేయబోతున్నామని వివరించారు. జిల్లాలో ఆయిల్‌ఫామ్‌ను పెద్దఎత్తున సాగుచేస్తున్నామని వివరించారు.

భిన్న వర్గాల ప్రముఖుల మాటామంతి

వనజీవి రామయ్య మాట్లాడుతూ చెట్లను మనం కాపాడితే చెట్లు మనలను కాపాడతాయని తెలిపారు. తాను ప్రభుత్వ ఆదాయం పెంచే శ్రీగంధం, ఎర్రచందనం వంటి మొక్కలను ప్రభుత్వ స్థలాల్లో నాటించడం జరుగుతుందని తద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం ఉంటుందన్నారు. తనకు సొంత ఇల్లు లేదని, ఇల్లు ఇప్పించాలని కోరారు. తాను నాటే మొక్కలకు సర్పంచ్ ద్వారా నీరు పోయించాలని సూచించారు.

నంది అవార్డు గ్రహీత దేవేంద్ర మాట్లాడుతూ బాలకార్మికులపై రాసిన గీతానికి నంది అవార్డు రావడం జరిగిందని గుర్తుచేశారు. సీనియర్ రంగస్థల కళాకారుడు కుతుంబాక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కళాకారులకు పెండింగ్ పింఛన్లు మంజూరుచేయాలని కోరారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు చంద్రమోహన్ మాట్లాడుతూ జిల్లాలో 5600 మంది సీనియర్ సిటిజన్లకు 111 గ్రామాల్లో ఈ ఏడాది పేషెంట్లకు వైద్యం అందించడం జరిగిందన్నారు. కవి, రచయిత సీతారాం, సాహిత్య అకాడమి సభ్యుడు, సీనియర్ జర్నలిస్టు ప్రసేన్ తాము రాసిన కవితలను వినిపించారు. కవి మువ్వా శ్రీనివాసరావు, ఆర్టిస్టు ఎస్.రవి, రచయిత కన్నెగంటి వెంకటయ్య, మరో కవి ఇబ్రహీం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కీసర ప్రభాకరరెడ్డి, డ్యాన్సుమాస్టర్ ఆచార్య మాధవరావుతోపాటు కవులు, క్రీడాకారులు మాట్లాడారు.

ఉద్యోగుల సమస్యలకు త్వరలో పరిష్కారం

● ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదులు


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదులు

బోనకల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను తొందరలోనే పరిష్కరిస్తామని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉద్యోగ సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో పాల్గొన్న ఆయన శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులతో మూడు గంటల పాటు చర్చించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకునే నాధుడే లేకుండా పోయారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే టీచర్లకు ప్రమోషన్లు, బదిలీలు, నూతనంగా టీచర్ పోస్టుల భర్తీని విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు. సర్వీసు రూల్స్ సాధన, పెండింగ్ బిల్లులు, 317 జీవో గురించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూల ధోరణిని వ్యక్తం చేయడం ఎంతగానో సంతృప్తిని ఇచ్చిందన్నారు.

సాంబాయిగూడెం ఇసుక ర్యాంపు వద్ద కూలీల ఘర్షణ

» పరస్పర దాడులకు యత్నం » ఇరువురికి స్వల్ప గాయాలు

మణుగూరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని పోతిరెడ్డి పల్లి, మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం ఇసుక ర్యాంపు నిర్వహణ పై ఇరువర్గాల కూలీల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. తమ పట్టా భూములోనే ఇసుక ర్యాంపు ఉందని లోడ్ అయిన లారీలకు టార్పాలిన్ కట్టె పనులు తామే చేయాలని పోతిరెడ్డిపల్లి గిరిజన కూలీలు పేర్కొనగా, లేదు సాంబాయిగూడెం గిరిజన కూలీలు మాత్రం స్టాక్ మా ప్రాంతంలోనే ఉంచారు కాబట్టి మేమే ఎత్తాలి, మేమే కట్టాలి అంటూ భీష్మించారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి తోపులాట వరకు దారితీసింది. ఓ సందర్భంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నాయి. ఇరువులు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సం ఘటనపై ఏడూళ్లబయ్యారం పోలీసు స్టేషన్‌లో పోతిరెడ్డి ప్రాంతానికి చెందిన కూలీలు ఫిర్యాదు చేయగా మణుగూరు పోలీసు స్టేషన్‌లో సాంబాయిగూడెం గ్రామానికి చెందిన కూలీలు ఫిర్యాదులు చేశారు..

కలప పట్టివేత

దుమ్ముగూడెం అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి బోదనెల్లి బీటు పరిధిలో అక్రమరవాణాకు సిద్ధంగా ఉన్న పదిహేను టేకు దిమ్మెలను అటవీ అధికారులు గురువారం రాత్రి దాడి చేసి పట్టుకోగా శుక్రవారం కేసు నమోదు చేశారు. దిమ్మెలను తరలిస్తున్న ట్రాక్టరు డ్రైవర్ అధికారులకు పట్టుబడ్డాడు. స్వాధీనం చేసుకున్న టేకు దిమ్మెలతో సహా వాహనాన్ని భద్రాచలం ప్రభుత్వ కలప డిపోకు తరలించారు. దాడుల్లో రేంజి అధికారి కమల రేంజి సిబ్బంది ఉన్నారు.


పట్టుబడిన టేకు దిమ్మెలు

డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

ఖమ్మం క్రైం, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల వద్దకు వెళ్లి పలువురిని డబ్బులు డిమాండ్ చేస్తున్న తల్లాడ మండలం ముద్దునూరుకు చెందిన కొరకొప్పుల రామారావుపై ఖమ్మం నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తాను ప్రైవేటు టీచర్ల సంఘ నాయకుడు అని ఓ ప్రయివేటు పాఠశాల యజమాన్యం వద్దకు వెళ్లి మీటింగ్ ఉన్నదని, అందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా రామారావుపై సత్తుపల్లి, కల్లూరు పోలీసుస్టేషన్లలో కూడా పలు కేసులు నమోదైనట్టు సమాచారం.

కానరాని సిటీ బస్సులు

» గతంలో 17, ప్రస్తుతం 2 » ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు » సిటీ బస్సులను పెంచాలని వినతి



ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సిటీ బస్సులు ఖమ్మం నగరంలో రోజు రోజుకు తగ్గుతున్నాయి. 2022లో రెండు బస్సులతో ప్రారంభించిన సిటీ బస్సులు ఆదాయం బాగుండటంతో మొదట 11 బస్సులను నడిపించారు. అనంతరం 17 బస్సులను నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. ఖమ్మం పాత బస్టాండ్ నుంచి మమతా రోడ్, వరంగల్ క్రాస్ రోడ్, రఘునాథపాలెం, తదితర ప్రాంతాల వరకు సర్వీసులు నడిపిన ఆర్టీసీ అధికారులు, రానురాను ఆ సంఖ్యను తగ్గిస్తూ చివరకు కేవలం రెండు సిటీ బస్సుల సర్వీసులే నడిపిస్తున్నారు. అవి కూడా నూతన బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు రోజుకు ఒక్కో బస్సు రెండు మూడు ట్రిప్పులు నడిపి, డిపోకే పరిమితమవుతున్నాయి. దీంతో ప్రయాణికులకు ఆటోలకు ఆశ్రయించక తప్పడం లేదు. గతంలో నడిపిన బస్సులను పేరు సిటీ బస్సు అని పెట్టి ఆ సర్వీసులను ఇల్లెందు, కోదాడ, తదితర రూట్లకు ఆర్టీసీ అధికారులు నడుపుతున్నారు. సిటీ బస్సులతో ఆదాయం బాగానే ఉన్నప్పటికీ, ఆ బస్సులు పూర్తి స్థాయిలో నడవడం వలన ఆటోల గిరాకీ తగ్గి, ఆర్టీసీ ఆదాయం పెరిగినప్పటికీ సిటీ బస్సులను ఎందుకు తగ్గిస్తున్నారో తెలియని పరిస్థితి. వాస్తవానికి నూతన బస్టాండ్ ప్రారంభమైన కొన్ని రోజులల్లోనే నగరంలో 11 సిటీ బస్సులను ప్రారంభించిన అధికారులు, ఆ తరువాత వాటిని 17కు పెంచారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం కూడా పెరిగింది. పాత బస్టాండ్ సిటీ బస్టాండ్‌గా మార్చిన రోజు సిటీ బస్టాండ్ నుంచి రోజు 250 పల్లెవెలుగు, సిటీ బస్సులు అందుబాటులో ఉండాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కానీ బస్సుల సంఖ్యను పెంచాల్సిన అధికారులు ఉన్న బస్సులను తీసివేసి ప్రయాణికులకు ఇబ్బందులను తీసుకొచ్చారు.

రోజుకు రూ.లక్ష ఆదాయం

2022 డిసెంబరు వరకు సిటీ బస్సుల ద్వారా రోజు రూ.లక్ష ఆదాయం వచ్చిందని, ఇంకా ఆదాయం పెరుగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పిన అధికారులు ఉన్న బస్సులను ఎందుకు తీసివేస్తున్నారో తెలియని పరిస్థితి.

ప్రస్తుతం నగరంలో నాలుగు, ఐదు బస్సులు తిరిగిన దాఖలాలు కానరావడం లేదు. పాత బస్టాండ్‌ను సిటీ బస్టాండ్‌గా మార్చిన తరువాత ప్రయాణికులకు కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి. బోనకల్, ముదిగొండ, ఇల్లెందుతో పాటు పల్లెవెలుగు బస్సులన్నీ సిటీ బస్టాండ్ నుంచే సర్వీసులు నడుస్తుండటంతో ప్రయాణికులకు తెలియక, ఆర్టీసీ అధికారులు ప్రచారం చేయక ఎక్కువ మంది ప్రయాణికులు నూతన బస్టాండ్‌కే వస్తున్నారు. ఇక్కడ నుంచి ఆ సర్వీసులు లేవు అని తెలిసి వెంటనే ఆటోలను ఆశ్రయిస్తున్నారు. నూతన బస్టాండ్‌లో సిటీ బస్సు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలిపే సూచిక బోర్డులు కానీ, మైక్ ద్వారా ప్రచారం లేకపోవడమే ఇందుకు కారణం. ఆటో డ్రైవర్లు బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను తీసుకెళ్తున్నా ఆర్టీసీ అధికారులు పోతేపోనీ అనే ధోరణిలో ఉన్నారనే చెప్పవచ్చు.

నాయకుల ఒత్తిడి...

గతంలో ఖమ్మం నగరానికి అర్బన్ బస్సుల పేరుతో 2014 లో 22 బస్సులను కేటాయించింది. కానీ అధికారులు ఆ బస్సులను తిప్పకుండా తిరిగి హైదరాబాద్‌కు పంపించారు. వాటిని ఎక్కువగా ఇల్లెందు, కోదాడ, తదితర ప్రాంతాలకు నడిపారు. అనంతరం వాటిని డిపోలోనే పక్కకు పెట్టిన అధికారులు ఇప్పుడు అదే సిట్టింగ్ ఉన్న సిటీ బస్సులను ఎలా నడుపుతున్నారో తెలియని పరిస్థితి. సిటీ బస్సు సర్వీసులు తగ్గడానికి కారణం రాజకీయ నాయకుల అండతో, ఆటో యూనియన్ల ఒత్తిడి వల్లనే సిటీ సర్వీసులను తగ్గించి వేరే ప్రాంతాలకు పంపిస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి. ఇకనైనా నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం సిటీ బస్సులను అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ట్రైనీ కలెక్టర్ల పర్యటన


గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

ఏన్కూరు/కారేపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఆయా మండలాల్లో ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన శుక్రవారంతో ముగిసింది. పలు విద్యాలయాలను, ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. పాఠశాలలో బాలికలతో మాట్లాడారు. పట్టుదలతో చదవాలని తెలిపారు. మండల అధికారులతో మాట్లాడారు. కారేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు, చిన్నారులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైనీ కలెక్టర్లు అంకిత్‌యాదవ్ ఇసాన్ గుప్తా, అల్తాఫ్ మహ్మద్, శుభం, పంకజ్ కుమార్‌మీనా, తహసీల్దార్ శేషగిరిరావు, ఎండీవో రమేష్, ఎస్‌ఐ రఫి, డాక్టర్లు రాములు మౌనిక సొసైటీ సీఈవో నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సీడీపీవో దయమణి, ఎంపీడీవో సురేందర్,ఎంపీవో రవిప్రసాద్, సూపర్‌వైజర్ రాధ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్యాంకులో చోరీ యత్నం

» గ్రిల్స్ తాళాలు పగలక జంట చోరుల విఫలయత్నం
» సీసీ ఫుటేజ్‌లో నమోదైన దృశ్యాలు
» పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంకు మేనేజర్

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో గల ఏపీజీవీబీ బ్యాంకులో శుక్రవారం తెల్లవారు జామున ఇద్దరు జంట చోరులు బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బ్యాంకు మేనేజర్ రవికుమార్ తెలిపిన సమాచారం ప్రకారం .. స్థానికంగా గల ఏపీజీవీబీ బ్యాంకు వద్దకు ఇద్దరు దొంగలు శుక్రవారం అర్ధరాత్రి వచ్చారు. బ్యాంకు ఎదురుగా గల గేట్ గ్రిల్స్‌కు ఉన్నమూడు లాకుల్లో ఒక దానిని పలుగుతో తొలిగించారు. దీనికే గంట సమయం పట్టింది. అప్పటికే తెల్లవారు జామున 3.30 సమయం అయింది. ఇదే సమయంలో బ్యాంకు సమీపాన గల సిండికేట్ షాపు వద్దకు ఓ సిమెంట్ లారీ దిగుమతికి రాగా అది గమనించిన సదరు జంట చోరులు తమ చోరీ యత్నాన్ని విరమించుకొని అక్కడ నుంచి వెళ్లి పోయినట్లుగా సీసీ ఫుటేజీలో నమోదు అయిందని బ్యాంకు మేనేజర్ తెలిపారు. బ్యాంకు చోరీ యత్నానికి వచ్చిన జంట చోరుల్లో 35 నుంచి 40 సంత్సరాల వయస్సు గల ఓ మహిళతో పాటుగా మరో వ్యక్తి ఉన్నట్లు సీసీ ఫుటేజీలో నమోదు అయిందని తెలిసింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు రోజు వారీగా విధులకు రాగా బ్యాంకు ముందు గల గ్రిల్స్‌కు ఉన్న తాళం పగలగొట్టి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బ్యాంకు మేనేజర్ రవికుమార్ తెలిపారు. కాగా సంఘటన స్థలానికి పత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగయ్య, ఎస్‌ఐ షాకీర్‌లు చేరుకొని వివరాలు సేకరించారు. కాగా పోలీసులు కేసు దర్యాప్తు చేయాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేంసూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కల్లూరుగూడెం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. అడసర్లపాడు గ్రామానికి చెందిన పాండురంగాచారి(44) మర్లపాడులోని పౌంద్రికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, కల్లూరుగూడెం వద్ద గేదెలు అడ్డురావడంతో ప్రమాదవశాత్తూ కంకర టిప్పర్ టైర్ కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు ...

దుమ్ముగూడెం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చినార్లగూడెం కొంగవాగు గుంపు వద్ద ఈనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు గురువారం అర్థరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల ప్రకారం.. నారాయణరావుపేటకు చెందిన పాయం జంపయ్య, కొమరం వీర్రాజు(27) కలసి ద్విచక్రవాహనంపై భద్రాచలం వెళ్లి అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న తాటిమొద్దును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జంపయ్య అక్కడికక్కడే మృతి చెందగా, వీర్రాజుకు తీవ్రగాయాలు కాగా, 108 వాహనంలో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వీర్రాజు మృతి చెందాడు. ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగి వ్యక్తి..

పెనుబల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ట్రాక్టర్ బ్యాటరీలో పోసే యాసిడ్‌ను మంచినీళ్లు అనుకొని తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండలంలోని కేడబ్బ్యా చౌడవరం గ్రామానికి చెందిన కణితి సత్యనారాయణ(45) ఈనెల 16న మద్యం మత్తులో ట్రాక్టర్ బ్యాటరీలో పోసే యాసిడ్‌ను మంచినీళ్లుగా భావించి తాగాడు. ఈ విషయాన్ని కుమారుడు సాయికిరణ్‌కు చెప్పగా వెంటనే కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు వీఎంబంజర్ ఎస్‌ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా



ఖమ్మంబైపాస్‌రోడ్డు/నేలకొండపల్లి, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి శుక్రవారం వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఎన్నెస్పీ గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్‌ను గల్లా సత్యనారాయణ సత్కరించారు. అనంతరం పలు విషయాలపై గవర్నర్‌తో చర్చించారు. కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, క్రిష్ణారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	48రూ.
వంకాయ	56
గుత్తి వంకాయ	60
బీరకాయ	68
పచ్చిమిర్చి	58
కాకరకాయ	58
బెండకాయ	58
పొట్లకాయ	60
దోసకాయ	48-58
గోరుచిక్కుడు	60
క్యాబేజీ	34
దొండ	38-48
సొరకాయ	38
క్యారెట్	48
క్యాప్సికం	88
అలుగడ్డ	40
ఉల్లిగడ్డ	55-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	జనక అయితే గనక..
శ్రీనివాస:	వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	రాధేశ్యాం
తిరుమల:	దేవర

తిరుమలాయపాలెంలో ట్రెయినీ కలెక్టర్ల పర్యటన



తిరుమలాయపాలెం ఆసుపత్రి వద్ద అధికారులతో శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లు

తిరుమలాయపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ బృందం సభ్యులు గురువారం పర్యటించారు. తిరుమలాయపాలెంలో రూపేష్‌జాల్వాల్, తరుణయ్‌పండే, సుమిత్ గోవింద బాయి మక్వానా, అభిషేక్ అందాస్, ఉషా యాదవ్, సామత్ మిలన్ మహిదోయి తదితరులు పర్యటించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు తెలుసుకున్నారు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, పోలీసుస్టేషన్, కేజీబీవీ పాఠశాలను, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు అందుతున్నాయనా లేది అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, డీటీ నరసింహారావు, ఏవో సీతారాంరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ కృపా ఉష్రశ్రీ, ఎస్ఐ జగదీష్ ఏపీఎం అలివేలు మంగ, ఎస్‌వో రమాకుమారి, ఎంపీవో సూర్యనారాయణ, ఏపీవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో పర్యవేక్షణ అధికారుల కొరత

- కీలకమైన విభాగాలకు కిందిస్థాయి ఉద్యోగులే ఇన్‌చార్జ్ అధికారులు
- అధికారులు సెలవుపై వెళ్లిన సందర్భాల్లో పడకేస్తున్న పాలన
- గందరగోళంగా మారుతున్న విభాగాలు



ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా ఉంది ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలన తీరు. వీధుల వెంట పారిశుధ్య పనుల నుంచి నగర అభివృద్ధిలో కీలకమైన పట్టణ ప్రణాళిక విభాగం వరకు సాధారణ పరిపాలనలో కూడా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలోని పలు విభాగాల్లో అధికారుల లోటు పాట్లను కమిషనర్ వద్ద పనిచేసే సిబ్బంది తప్పుదోవ పట్టించే రీతిలో పైస్థాయి అధికారులకు సమాచారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక విభాగం పనుల్లో మరో విభాగం వారి జోక్యం పెరిగి కొన్ని ఫైల్స్ కదలిక విషయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కీలకమైన విభాగాల్లో లాబీయింగ్ పెరిగిందనే ఆరోపణలున్నాయి. ఇలా కొంతకాలంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలన పలు విమర్శలకు గురవుతోంది.

ఇదిలావుండగా, ఖమ్మం పురపాలక సంస్థ హోదా నుంచి నగర పాలక సంస్థగా హోదా పెరిగి 12ఏళ్లు పూర్తయినా ఆ మేరకు అధికారులు, పర్యవేక్షకుల నియామకం జరగకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన ఉన్నతాధికారులు వరుస సెలవులపై వెళ్లటం నగర పాలక సంస్థ పరిపాలనను కలవర పెడుతోంది. పారిశుధ్యంతో పాటుగా కేఎంసీ పరిపాలన బాధ్యతలు నిర్వహించే అసిస్టెంట్ కమిషనర్ అనారోగ్యకారణాలతో పది రోజులు పాటుగా సెలవుపై వెళ్లనున్నారు. ఆపై అధికారి కూడా సెలవు పై వెళ్లేందుకు అనుమతి పొందినట్లు సమాచారం తెలుస్తోంది. అధికారులు సెలవుపై వెళ్లిన సందర్భాల్లో పాలన పడకేస్తోందనే విమర్శలున్నాయి.

ఖమ్మం పురపాలక సంస్థ 2012అక్టోబరు 19న నగర పాలక సంస్థగా హోదా పెరిగింది. హోదా పెంపు తర్వాత ఏడాది లోపుగానే ఆ మేరకు అధికారులు, పర్యవేక్షక అధికారులు, డిప్యూటీ అధికారుల నియామకం జరపాల్సి ఉంది. ఐఏఎస్ అధికారులను కమిషనర్లుగా నియామకం చేస్తున్న ప్రభుత్వం.. నగరపాలక సంస్థలో పర్యవేక్షణకు కావాల్సిన అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పెంపుపై మాత్రం దృష్టి పెట్టలేదు. పలు కీలకమైన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ వంటి విభాగాలకు ఉన్నత స్థాయి పర్యవేక్షణ అధికారులు లేక పోవటంతో కిందిస్థాయిలోని ఉద్యోగులే ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కీలకమైన క్లిష్టమైన నిర్ణయాల విషయంలో వెనకడుగువేస్తున్నారనితెలుస్తోంది. దీంతో ఒక అధికారి సెలవు పెడితే ఆ విభాగం పూర్తిగా పడకేసే పరిస్థితి కేఎంసీలో నె లకొంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యే క చొరవతో మరో డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన అధికారికి డిప్యూటేషన్ వేసినా సాంకేతిక కారణాలతో జీవో విడుదల కాలేదని తెలుస్తోంది.

పెన్షన్‌లో కోత విధించకండి

- ట్రెజరరీ డీడీకి విశ్రాంత పోలీసు అధికారుల సంఘం వినతి



వినతి పత్రం అందజేస్తున్న విశ్రాంత పోలీసు అధికారుల సంఘ సభ్యులు

ఖమ్మం క్రైం, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విశ్రాంత అధికారుల పెన్షన్‌లో కోత విధించవద్దని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ట్రెజరరీ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీడీ తెలిపినట్టు విశ్రాంత పోలీసు అధికారుల సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ రాధాక్రిష్ణ మూర్తి, వెంకట నారాయణ, సోమయ్య, జయకర్ బాబు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు

3న సకల ఉద్యోగుల సమారాధన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్

తిరుమలాయపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సకల ఉద్యోగుల ఆధ్వర్యంలో తలపెట్టిన వనసమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుమలాయపాలెం వైద్యవిధానపరిషత్ సూపరింటెండెంట్ డాక్టర్ కృపా ఉషశ్రీ తెలిపారు. గురువారం తిరుమలాయపాలెంలోని వైద్యవిధానపరిషత్ ఆసుపత్రిలో నవంబరు 3న ఖమ్మంలో జరిగే సకల ఉద్యోగుల సమ్మేళనంలో భాగంగా నిర్వహించనున్న వనసమారాధన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అవిష్కరించారు. ఐక్యతకు మారుపేరుగా జరిగే కార్యక్రమంలో ప్రతి ఉద్యోగ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జగదీష్, తహసీల్దార్ పీవీ రామకృష్ణ డాక్టర్లు ఎం.నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లానాయకులు జమ్మి జయపాల్, చంద్రశేఖర్, ప్రవీణ్, దిలీప్, ఏవో సీతారాంరెడ్డి, ఏపీఎం అలివేలుమంగ, ఆర్ఐలు వీరయ్య, లహరి పాల్గొన్నారు.

ముగిసిన కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ



ట్రైనర్ ఆతోషిరాయ్ సన్మానిస్తున్న కృష్ణ

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటి కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ శుక్రవారంతో ముగిసిందని విద్యా సంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పై కూడ పట్టు సాధిస్తే అత్యధిక ప్లేస్‌మెంట్స్ పొందగలుగుతారని అన్నారు. గ్రూప్ డిస్కషన్స్, రీడింగ్ స్కిల్స్, సెల్ఫ్ ఇంట్రోడక్షన్ తదితర అంశాలపై అదగాహన కల్పించామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రీ అన్నారు. వివిద బహుళజాతి కంపెనీలలో ఉద్యోగులకు శిక్షణ ఇచ్చిన అనుభవం కలిగిన ట్రైనర్ ఆతోషిరాయ్‌తో మా కళాశాల విద్యార్థులకు శిక్షణ అందించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ రాజ్‌కుమార్ అన్నారు. అనంతరం ట్రైనర్ ఆతోషిరాయ్‌ను చైర్మెన్ కృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాలొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రతిపాదనలు మానుకోవాలి

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు, 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల స్థలం పొందిన నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ కట్టే ప్రతిపాదనలను విరమించుకోవాలని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు డిమాండ్ చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే కళాశాల వాతావరణం, ఔన్నత్యంను పరోక్షంగా దెబ్బ తీయటమేనని అన్నారు. 69 ఎకరాలున్న కళాశాల భూమి నేడు 27 ఎకరాలకు కుంచుకుపోయిందన్నారు. కొందరు నాయకుల లాభాపేక్ష కొసమే షాపింగ్ కాంప్లెక్స్ ప్రతిపాదనలు చేశారని, గతంలోను ఇలాంటి ప్రతిపాధనలు చేస్తే పూర్వ విద్యార్థుల సంఘం తరుపున నిరాహార దీక్ష, ఆందోళనలతో ప్రతిపాదనలు విరమించుకున్నారని, మళ్లీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రతిపాదనలతో ముందుకొస్తే అఖిల పక్షాలు, విద్యార్థి సంఘాలతో కలిసి ప్రతిఘటిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానం ప్రకారం కళాశాలను క్లస్టర్ యునివర్సిటిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కళాశాల చరిత్ర, ఔనిత్యాన్ని , అభివృద్ధి కోసం జిల్లా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదభరితంగా ఖమ్మం, చెర్వు కొమ్ముతండా రహదారి
- తరుచూ ప్రయాణిస్తున్న మంత్రుల కాన్వాయ్

రఘునాథపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అది తరుచూ మంత్రులు కాన్వాయ్ ప్రయాణించే చెర్వు కొమ్ముతండా ప్రధాన రహదారి.. మూడు నెలల క్రితం ఈ రహదారి మూలమలుపు పక్కనే మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం 8అడుగులు లోతు తీసి మరమ్మతులు చేశారు. తర్వాత గోతిని పూడ్చలేదు. సెప్టెంబరులో కురిసిన భారీవర్షాలకు సమీపంలోని గుట్ట మట్టి చేరి కొంతమేరకు పూడిపోయింది. తర్వాత గుంతను స్థానికులు పిచ్చిమొక్కలను గుంతలో వేశారు. పైకి కనిపించకుండా ఎండిన చెట్లు ఉన్న గుంత లోతుమాత్రం ఉంది. ప్రమాదభరితంగా ఉన్న గుంతను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చెర్వుకొమ్ము తండా రహదారిలో మూలమలుపు వద్ద ప్రమాదకర గుంత

నాడు డంపింగ్ యార్డు.. నేడు పచ్చని వనాలు

- వ్యర్థాలను తొలగించి బయోమైనింగ్
- 7 ఎకరాల స్థలంలో 15వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఇప్పటికే వెయ్యి మొక్కలు నాటి సంరక్షణ చర్యలు
- ప్రత్యేక చొరవ తీసుకున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య



డంపింగ్ యార్డ్ ఖాళీ స్థలంలో నాటిన మొక్కలు

ఖమ్మం సంక్షేమ విభాగం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాడు చెత్త వ్యర్థాలతో పెద్ద గుట్టలుగా మారిన ఖమ్మం డంపింగ్ యార్డు. కానీ ఆదే ప్రాంతం నేడు పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా మారింది. ఖమ్మం నగరం నుంచి తరలించిన చెత్త వ్యర్థాలు పెద్ద సమస్యగా మారటంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. క్యూబ్స్ బయోమైనింగ్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ కాలనీ సమీపంలో ఉన్న ఖమ్మం డంపింగ్‌యార్డు శుద్దిని బయోమైనింగ్‌కు అప్పగించారు. దీంతో 2023 జనవరి బయోమైనింగ్ ప్రారంభమైంది. 85 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ది చేశారు. డంపింగ్‌యార్డులోని 7 ఎకరాల విస్తీర్ణంలోని స్థలాన్ని శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో 15వేల మొక్కలను నాటేందుకు కార్యచరణ చేశారు. శుక్రవారం నాటికి వెయ్యికి పైగా మొక్కలను నాటారు. వాటి సంరక్షణ చర్యలను తీసుకున్నారు. దీంతో నాడు డంపింగ్ వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లిన ప్రాంతం నేడు పచ్చని వనంగా మారింది. మియావాకీ ఫారెస్ట్ ప్లాంటేషన్ రూపు దిద్దుకుంటోంది.

బయోమైనింగ్ ద్వారా వచ్చిన ప్లాస్టిక్(ఆర్‌డీఎఫ్)ను సిమెంట్ ప్యాక్టరీలకు తరలించారు. బయోమైనింగ్‌లో వచ్చిన బయోసాయిల్‌ను మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇతర వ్యర్థాలను అవసరాల కోసం వినియోగించుకునేందుకు సిద్ధం చేశారు.

ఇదేం శిక్ష?

- వృద్ధులు, ఫిర్యాదుదారులకు నిలువుకాళ్ల పరీక్ష
- ఏఎంసీ ఛాంబర్ ఎదుట కుర్చీల తొలగింపు
- సమంజసంగా లేని అధికారి తీరు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసేందుకు నిత్యం పదుల సంఖ్యలో దివ్యాంగులు, వృద్ధులు, ఫిర్యాదుదారులు, కార్యాలయ ఉద్యోగులు వస్తుంటారు. అసిస్టెంట్ కమిషనర్ పారిశుధ్య పనుల పర్యవేక్షణ పర్యటనకు వెళ్తుండటంతో అయన్ని కలిసేందుకు వచ్చిన వారికి సమయం పడుతోంది. ఈ క్రమంలో గతంలో పని చేసిన అసిస్టెంట్ కమిషనర్లు తమ ఛాంబర్ల ఎదుట రెండు వరసలతో కూర్చీలను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడకు వచ్చిన వారు ఆ కూర్చిల్లో సేదతీరేవారు. అధికారిని కలిసేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. అక్కడ ఏర్పాటు చేసిన కూర్చీలను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారి తొలగించారు. తన ఛాంబర్ ఎదుట కేవలం అటెండర్ మినహా ఎవ్వరూ ఉండకూడదని కూర్చీలను తొలగించారు.

దీంతో అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన దివ్యాంగులు, వృద్ధులు, పారిశుధ్య కార్మికులకు నిలువుకాళ్ల పరీక్ష తప్పటం లేదు. కూర్చునేందుకు ఏర్పాటు చేసిన సీట్లు తొలగించటం సమంజసంగా లేదని అసిస్టెంట్ కమిషనర్ ఛాంబర్‌కు వచ్చి నిరీక్షిస్తున్నవారు వాపోతున్నారు.



నాడు ఇలా కుర్చీల ఏర్పాటు..



నేడు ఇలా కుర్చీల తొలగింపు

దరఖాస్తులు ఎక్కువ.. దుకాణాలు తక్కువ

- ఆందోళనలో బాణాసంచా షాపుల యజమానులు
- ఇప్పటికే సామగ్రికి నగదు చెల్లింపు

ఖమ్మం క్రైం, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగకు టపాసుల షాపుల యజయానులు ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. కాని దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికి షాపు దక్కుతుందో లేదో అని షాపు యజమానులు సందిగ్ధంలో ఉన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికి షాపులు దక్కాయి. కాని ఇప్పుడు దరఖాస్తులు ఎక్కువగా రావడంతో షాపులు నిర్వహించే యజమానులు ఆందోళన చెందుతున్నారు. షాపులు ఏర్పాటు చేసే మైదానంలో ఖాళీ లేకపోవడంతో ఏం చేయాలా అన్న ఆలోచనలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒకవైపు సరుకుకు డబ్బు చెల్లించి ఇప్పుడు షాపులు రాకపోతే ఏంటని యజమానులు ప్రశ్నిస్తున్నారు.

140కి పైగా దరఖాస్తులు.. 122 షాపులు

టపాసుల షాపులు నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు ప్రకటన చేయడంతో షాపులు నిర్వహించే వారు ఇప్పటికే భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ప్రతి ఏడాది కంటే దరఖాస్తులు అధికంగా రావడంతో అధికారులు కూడా ఏం చేయాలా అని ఆలోచన చేస్తున్నారు. శుక్రవారం వరకు ఖమ్మం టూటౌన్ పోలీసుల వద్దకు 133మంది దరఖాస్తుల లిస్ట్ వచ్చింది. మరో 10 వరకు సీపీ కార్యాలయంలో దరఖాస్తులు వచ్చాయి. కానీ షాపులు నిర్వహించే ప్రాంతం అయిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో 122షాపులకు మాత్రమే ఏర్పాటు చేశారు. అక్కడ ఇంకా షాపులు పెంచాలన్నా వీలు లేకుండా పోవడంతో అధికారులు ఆలోచిస్తున్నారు. ఇప్పటికే అధికారులు ప్రకటన మేరకు దరఖాస్తు చేసుకున్న యజమానులు సరుకు తెచ్చుకునేందుకు ఒక్కొకరు సుమారు రూ.5లక్షల వరకు డబ్బులు కూడా చెల్లించారు. షాపులు దక్కక పోతే కట్టిన డబ్బులు రావని షాపుల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.



ట్రాఫిక్ కు ఇబ్బందులు

గతంలో టపాసుల షాపులు నిర్వహించే ప్రాంతం రోడ్డన్ని కొంతమేర ట్రాఫిక్ జామ్ అయ్యేవి. కాని ఇప్పుడు అమైదానంలో వాహనాలు నిలిపే ప్రాంతంలో ఎక్స్‌పో కు అనుమతులు ఇవ్వడంతో వారు ఇప్పటికే ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంది. అదే విధంగా మైదానంలో వెళ్లేందుకు గతంలో రెండు వైపుల దారి ఉండేంది. ఇప్పుడు ఎక్స్‌పో ఉండటంతో బైపాస్‌రోడ్డులో ఒక్కవైపు మాత్రమే దారి ఉంది. ఇప్పుడు వాహనాలలో వెళ్ళాలన్నా, నడుచుకుంటు వెళ్లాలన్నా ప్రజలకు ఆ ప్రాంతంలో ఇబ్బందులు తలెత్తు అవకాశం ఉంది. వాహనాలు నిలిపే స్థలం లేకపోవడంతో వాహనదారులు రోడ్డుపై వాహనాలు నిలిపి వెళతారు. అదేవిధంగా బైపాస్‌రోడ్డులో నిత్యం వాహనాలు రద్దీగా ఉంటుంది. దీంతో భారీ వాహనాలు బారిగా నిలిచిపోయే అవకాశం కూడా ఉంది. ఇప్పటికే పోలీసు అధికారులు ఏలా చేస్తే ట్రాఫిక్ కు ఇబ్బందులు ఉండవు అన్న దానిపై చర్చిస్తున్నట్లు తెలిసింది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

ఖమ్మం రూరల్, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని కోరుతు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ ఉషాకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగిణి, స్వాతి, శ్రీలత, నవ్య, సింధు, పూజిత పాల్గొన్నారు.

'ప్రతాపనేని' జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం

ఖమ్మం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని కామంచికల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రతాపనేని సత్యనారాయణ జీవితం, భావితరాలకు స్ఫూర్తిదాయకం అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. కామంచికల్ గ్రామంలో శుక్రవారం సత్యనారాయణ ఎనిమిదవ వర్ధంతి సభ నిర్వహించారు.

పీహెచ్‌డీ పట్టా సాధించిన రామినూతల వాసి



బోనకల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన వ్యక్తి పీహెచ్‌డీ పట్టా సాధించి అందరి ప్రశంసలు పొందాడు. గ్రామానికి చెందిన భూక్యా సూర్యం, రంగమ్మ దంపతుల కుమారుడు రాము ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ మరోవైపు బ్రెయిన్ ట్యూమర్ పై అధ్యయనం చేయగా పంజాబ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నాడు. పీహెచ్‌డీ పట్టా సాధించిన రామును పలువురు అభినందించారు.

అధ్వాన స్థితిలో సంక్షేమ హాస్టళ్లు

ఏన్కూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మరావుపేట ఎస్సీ, ఎర్రబోడుతండా ఎస్టీ హాస్టళ్లు అధ్వానస్థితిలో ఉన్నాయి. ఉన్నతాధికారులు హాస్టళ్ల వైపు కన్నెత్తిచూడకపోవడంతో వార్డెన్లు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారంగా కొనసాగుతుంది. హాస్టళ్లకు కేటాయించిన బియ్యం, నిత్యావసర వస్తువులు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు హాస్టళ్లలో కేవలం 60మంది చొప్పున విద్యార్థులు ఉన్నట్టు అధికారికంగా చూపిస్తున్నప్పటికీ, ఏ ఒక్కరోజు కూడా వాస్తవంగా 30మందికి మించి ఉండడంలేదు. దీంతో పాటు వర్షం వస్తే తిమ్మరావుపేట హాస్టల్‌కి వరద నీరు చేరి, బురదభయంగా మారుతుంది. ఎర్రబోడుతండా ఎస్టీ హాస్టల్ శిథిలావస్థకు చేరింది. మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయి పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లపై నిరంతరం తనిఖీ చేస్తూ ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

పల్లె దవాఖానాల ప్రారంభమెప్పుడో..



కల్లూరు ఎన్నెస్పీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖాన

కల్లూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో గత ప్రభుత్వ హాయంలో పేద ప్రజలకు ప్రభుత్వ పరంగా వైద్యసేవలు అందించాలని పల్లె దవాఖానలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందుకోసం ఈ దవాఖానల కోసం అనువైన స్థలాలను సేకరించి గత ఏడాదిన్నర క్రితం ఈ భవనాలు నిర్మించారు. రూ.20 లక్షల నిధులతో కల్లూరు పట్టణంలో ఎన్నెస్పీ క్యాంపు, పుల్లయ్యబంజర వీధి వైపున రెండు భవనాలను నిర్మించింది. ఈ భవనాలను నిర్మించి మూడు నెలలు కావొస్తున్నా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. సత్తుపల్లి నియోజవర్గ స్థాయిలో ప్రజ ప్రతినిధి చేత ఈ భవనాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించి, వారి కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. సదరు ప్రజా ప్రతినిధిని గత మాడు నెలల నుంచి ప్రారంభానికి పిలిచిన సమయం దొరకని పరిస్థితి. దీంతో నేటికి వాటి ప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె దవాఖానాలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించరూ..

తల్లాడ, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తల్లాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు నిత్యం నరక యాతన పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 178మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో వందమంది బాలికలు, 78మంది బాలురు ఉన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కోసం ఒక మూత్రశాల, ఒక మరుగుదొడ్డి, బాలికల కోసం నాలుగు మూత్రశాలలు, నాలుగు మరుగుదొడ్లు వేర్వేరుగా ఉన్నాయి. పాఠశాలలో బాలురుకు పూర్తిగా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సంఖ్యకను గుణంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మరుగుదొడ్లు లేక ఆరుబయటకు వెళ్తున్న విద్యార్థులు

సత్తుపల్లిలో పందులు, కుక్కల స్వైరవిహారం



సత్తుపల్లిలో సంచరిస్తున్న వీధికుక్కలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి పట్టణంలో పగులు రాత్రి తేడా లేకుండా పందులు, కోతులు, వీధికుక్కలు విపరీతంగా సంచారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇటీవల కాలంలో అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపకందారులు సొంత స్థలంలో పెంచాల్సింది పోయి వాటిని యథేచ్ఛగా పట్టణంలో వదిలేస్తున్నారు. అవి అన్ని వీధుల్లో సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో పట్టణంలో ఓ వీధికుక్క సుమారు 40మందిని కరిచి గాయపడిన సంఘటన ఇందుకు నిదర్శనమని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన తక్షణమే వీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇదే విషయమై మునిసిపల్ కమీషనర్ మందా రవిబాబును వివరణ కోరగా వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మత్స్యకారుల బలోపేతానికి ప్రభుత్వం కృషి

మధిరటౌన్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మత్స్య సహకార సంఘ సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, ఫిషరీస్ ఏడీ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మధిర చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ప్రభుత్వం చెరువు సామర్థ్యాన్ని బట్టి వంద శాతం చేప పిల్లలను ఉచితంగా అందజేస్తుందని మొదటి విడతగా నేడు 50 శాతం పిల్లలను అందచేయడం జరిగిందని అన్నారు. చెరువు సొసైటీ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఇరిగేషన్ ఏఈ అఖిల్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

‘టీఎన్జీవోస్ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి’

మధిరటౌన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో నవంబరు 3న జరిగే టీఎన్జీవోస్ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం మధిర మండల అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంబాబు చేతుల మీదుగా టీఎన్జీవోస్ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గద్దల రజనీకాంత్, నాయకులు నాగేశ్వరరావు, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాసరి పద్మ సేవలు చిరస్మరణీయం: ఎంఈవో

తల్లాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సంఘ సేవకురాలు, సినీ నిర్మాత దాసరి పద్మ సేవలు చిరస్మరణీయమని తల్లాడ మండలం విద్యాశాఖ అధికారి ఎస్.దామోదర్‌ప్రసాద్ కొనియాడారు. మండలంలోని అన్నారుగూడెం లోని జడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన దాసరి పద్మ జయంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సినీ నిర్మాతగా దాసరి పద్మ తనకు వచ్చిన ఆదాయాన్ని సామాజిక సేవ కార్యక్రమాలకు హితోదికంగా అందించటం జరిగిందన్నారు. ఆమె జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సహకారంతో గుమ్మా నరేష్ అన్నారుగూడెం హైస్కూల్లో స్థలా వేదిక నిర్మించడం, మొక్కలు నాటడం, విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స మాఖ్య గౌరవాధ్యక్షుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), అధ్యక్షుడు గుమ్మా నరేష్, దుగ్గిదేవర అజయ్‌కుమార్ తదితరులున్నారు.

అంతరాష్ట్ర సరిహద్దు ధాన్యం చెక్‌పోస్టుల ప్రారంభం

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దారుగబంజరు, తాళ్లూరు వెంకటాపురం గ్రామాల సరిహద్దున శుక్రవారం అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ప్రారంభించారు. మండల తహసీల్దార్ పి. సాంబశివుడు, ఏవో రూప, ఎస్ఐ యస్‌కె షాకీర్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిన్నకోరుకొండి పీఏసీఎస్ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, సీతంపేలు వేలాద్రి, అంజయ్య, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

బోనకల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో శుక్రవారం అంతరాష్ట్ర సరిహద్దు ధాన్యం తనిఖీ కేంద్ర చెక్‌పోస్టును తహసీల్దార్ పున్నం చందర్, డీటీ రాంచందర్‌లు ప్రారంభించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోకి రాకుండా పకడ్బందీగా అధికారులు తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రీ, ఎస్ఐ మధుబాబు, ఆర్ఐ లక్ష్మణ్ ఉన్నారు.

‘అర్హులైన రైతులందరికీ నష్ట పరిహారం అందించాలి’

బోనకల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ నష్ట పరిహారం అందించాలని సీపీఐ రైతు సంఘ జిల్లా నా యకుడు పారుపల్లి నర్సిహారావు డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నష్ట పరిహారం పొందిన జాబితాను బయటకు వెల్లడించాలని కోరారు. పంట వేయకపోయినా పరిహారం అందించిన అధికారుల పై చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల నుంచి రికవరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, కృష్ణయ్య, కోటయ్య, శ్రీకాంత్, వెంకన్న, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య అరెస్ట్‌పై ఖండన

చింతకాని, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అరెస్టును సీపీఎం, బీజేపీ పార్టీల మండల కమిటీలు ఖండించాయి. మండల కేంద్రంలో శుక్రవారం ఆయా పార్టీల కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో రాస్తారోకోలు, ధర్నాలు సహజమన్నారు. రాజకీయ పార్టీల అంతిమ లక్ష్యం ప్రజాశ్రేయస్సేనని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ మరణిస్తే, న్యాయం కోసం వారి కుటుంబం సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తుండగా, వారికి మద్దతుగా పుల్లయ్య పాల్గొన్నారని, దీనిని సాకుగా చూపి ఆయనపై రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం భావ్యం కాదన్నారు. ఇలాంటి చర్యలను తాము ఖండిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, బీజేపీ మండల అధ్యక్షడు కొండా గోపి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చెరకు రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

● కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ మేనేజర్ కొడాలి రఘునాథబాబు

మధిర రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించేలా ఫ్యాక్టరీ యాజమాన్యం తరుపున అన్ని విధాలుగా వారిని ప్రోత్సాహిస్తున్నట్లు మేనేజర్ కొడాలి రఘునాథబాబు చెప్పారు. మధిర మండలంలోని వంగవీడు, సిరిపురం గ్రామాల్లో శుక్రవారం యాజమాన్యం తరుపున చెరుకు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి క్రషింగ్ సీజన్‌లో కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో యంత్రాలతో చెరకును నరుకుట ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేన్ మేనేజర్ కె రఘునాథబాబు, సీనియర్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రభాకరరావు, ఫీల్డ్‌మెన్ యం ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మేనేజర్ రఘునాథబాబు

పనుల్లో నాణ్యత పాటించాలి

● కాంగ్రెస్ పార్టీ నాయకుడు దయానంద్

సత్తుపల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాల నిర్మాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా తామర చెరువు వద్ద ఫ్రీడమ్ పార్క్, 100పడకల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రహదారులు, జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో రోడ్లు నిర్మాణ పనులను, అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సూచనలిస్తున్న దయానంద్

తాతా రంగారావుకు పలువురి నివాళి



రంగారావు అంత్యక్రియాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

వైరా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, సొసైటీ మాజీ అధ్యక్షుడైన తాతా రంగారావు అంత్యక్రియలు శుక్రవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, లావుడ్యా రాములునాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు తదితరులు రంగారావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఫోన్ ద్వారా రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. రాష్ట్ర అంబేద్కర్ ప్రజాసంక్షేమసంఘం అధ్యక్షుడు లింగాల రవికుమార్, టీడీపీ కొణిజర్ల మండల అధ్యక్షుడు తాతా సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, వైరా మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ అల్లిక కాటంరాజు, మాజీ సర్పంచ్ బట్టా పెద్దభద్రయ్య, చింతనిప్పు మురళీ, అడపా రామకోటయ్య, బండి గోపాలకృష్ణ, వైరా సొసైటీ సిబ్బంది, తదితరులు రంగారావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.

తుపాకులపై అవగాహన ఉండాలి

సత్తుపల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో పిల్లలకు రక్షణ ఆయుధాలైన తుపాకులపై అవగాహన కలిగి ఉండాలని బెటాలియన్ కమాండెంట్ పీజేపీ సీ.ఛటర్జీ అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే-2024దినోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్డీ.రంగారెడ్డి, ఆఫీసర్స్ కానిస్టేబుల్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



తుపాకుల గురించి వివరిస్తున్న బెటాలియన్ ఉద్యోగులు

ఉద్యోగుల కుటుంబాలను కంటిరెప్పలా కాపాడుకుంటాం

● ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి



ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పరీక్షలు చేయిస్తున్న డీఎం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో అభివృద్ధికి క్రమశిక్షణతో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబాలను కంటిరెప్పలా కాపాడుకుంటామని డీఎం యూ.రాజ్యలక్ష్మీ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో నిర్వహిస్తున్న గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్-ఎస్ కార్యక్రమాన్ని శుక్రవారం సత్తుపల్లిలో ఆమె ప్రారంభించారు. ఆరోగ్యంగా ఉన్నప్పటికీ శరీరంలో ఎలాంటి రోగాలు ఉన్నాయో ముందుగా గు ర్తించకపోవడంతో ఎంతగా నష్టపోయామో వైద్య పరీక్షలు చేయించుకుంటే కానీ తెలియదని, సరిగ్గా ఇలాంటి ఆలోచనే సంస్థ ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నాలుగు రోజుల పాటు సంస్థ ఉద్యోగుల జీవిత భాగస్వామికి వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ సిలివేరు, పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలను ఆహ్వానించిన మధిర బార్ సభ్యులు



హైకోర్టు జడ్జిలకు ఆహ్వానాలు అందిస్తున్న న్యాయవాదులు

మధిర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిరలో శనివారం ప్రారంభించనున్న సబ్ కోర్టు ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీ. శ్రీసుధ, జస్టిస్ బీ. నగేష్, జస్టిస్ కె. శరత్‌లను మధిర బార్ అసోసియేషన్ ఆహ్వానించింది. గురువారం రాత్రి బార్ సభ్యులు అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లి హైకోర్టు న్యాయమూర్తులను కలిసి ఈమేరకు ఆహ్వానపత్రాలను అందించారు. ఈకార్యక్రమంలో కోర్టు నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కట్టా పూర్ణచంద్రరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధాన్ని విజయవంతం చేయాలి

▸▸ ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాంబాబు

తల్లాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ పీడిత ప్రజల ఆత్మగౌరవం, అధికారం కోసం ధర్మసమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో నవంబరు 3నుంచి జరిగే ధర్మయుద్ధానికి సన్నద్ధం కావాలని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం తల్లాడలో ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఇండ్లస్థలాలు, ఇండ్లు, ఉపాధి కల్పనే ధ్యేయంగా ధర్మయుద్ధానికి పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ శ్రీకారం చుట్టారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మేడి బసవయ్య పాల్గొన్నారు.

‘ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటం’

మధిరరూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నిరంతరం పోరాటంచేస్తామని పలువురు సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం సీపీఎం పార్టీ మండల మహాసభ మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరావు, శీలం నరసింహారావులు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారం వచ్చాక ఒక రకంగా, అధికారం లేకపోతే మరో రకంగా మాట్లాడుతూ ప్రజలను భ్రమలకు గురి చేస్తున్నారన్నారు. కళాకారులు కోలాట నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈమహాసభకు అధ్యక్షవర్గంగా కామ్రేడ్ ఓట్ల శంకరరావు దొంతి వీరాచారి, వెంకాయమ్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జామా మసీద్ సదర్‌గా రసూల్

సత్తుపల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి జామా మసీద్, మార్కెట్ మసీద్ కమిటీల సదర్‌గా ఎస్‌కే.నాయబ్ రసూల్ ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక మసీద్‌లో నిర్వహించిన ఎన్నికలలో ఆయన ఎన్నికయ్యారు. గత మూడు నెలలుగా వాయిదాలు పడుతూ వస్తున్న సదర్ ఎన్నికలు ఎట్టకేలకు మసూరా కమిటీ సభ్యులు ఎస్‌కే.మౌలీలా, మోనార్క్ రఫీలు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కే.మౌలాలీ, ఎండీ.కమల్‌పాషా, ఎస్‌కే.రఫీ, ఎస్‌కే. మునీర్, ఎండీ.రియాజుద్దీన్, ఆబీద్‌అలీ, ఎస్‌కే.వాహెద్, సయ్యద్ ఖలీల్, ఆయూబ్‌పాషా, మున్వర్‌హుస్సేన్, అమీర్‌జానీతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సైదులు ఎన్నిక



మధిరరూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ మధిర మండల కార్యదర్శిగా మందా సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయనను తిరిగి మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరావు జిల్లా నాయకుడు బండి రమేష్ పాల్గొన్నారు.

ఈనెల 29న పూజసామాగ్రి వేలం

ఏన్కూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన గార్లొడ్డు శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ పూజ సామాగ్రి వేలం పాటను ఈనెల 29న మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్‌వీడీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈవేలంలో ఆసక్తిగలిగిన వారు డిపాజిట్ డీడీ తీసి పాల్గొనాలని కోరారు.

విద్యుత్‌శాఖ-పొలంబాట

కారేపల్లి అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం చీమలపాడు సెక్షన్ పరిధిలోని నానునగర్ తండా పరిధిలో పోలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ రామకృష్ణ రైతులతో మాట్లాడుతూ మోటార్లపై పడే ఓల్టేజి హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడే ఓవర్ లోడ్ గురించి, భద్రత సూచనలపై వివరించారు. కార్యక్రమంలో సబ్‌స్టేషన్ సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ముదిగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను ముదిగొండ పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సీఐ మురళీ ఆదేశాల మేరకు ఏఎస్ఐ సాంబశివరావు తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడిలో రూ.3,130 నగదును స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈమేరకు సీఐ మురళీ నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత పశువైద్య శిబిరం

ఎర్రుపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో శ్రీసత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యం శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈశిబిరంలో పశువులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించిన పాడిరైతులకు మందులను అందించారు. అనంతరం తక్కెళ్లపాడు రాజరాజేశ్వరి ఆలయంలో గోశాలలో గోవులను పరీక్షించి మందులను అందించారు. నోరులేని మూగజీవాలకు వైద్యం అందించేందకు తోడ్పాటునిచ్చిన సేవాసంస్థ సభ్యుల బృందానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణారెడ్డి, సిరిపురం పశువైద్యురాలు డాక్టర్ ఉమ, మండల పశువైద్యసిబ్బంది, గోపాలమిత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రాసి కల్లాలు ప్రారంభం

కల్లూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలో ధాన్యం రాసి కల్లాలను శుక్రవారం కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి ప్రారంభించారు. వానకాలం సీజన్‌లో దిగుబడి అయిన ధాన్యాన్ని అరబెట్టుకునేందుకు అనువైన విధం గా కల్లాలకు స్థలాలు లేవు. దీంతో ధాన్యం రాశులను పోసుకునేలా కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు స్థానికంగా పలువురు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సాగర్ ఎడమకాల్వపై కప్పలబంధం రెగ్యులేటర్ వద్ద ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి మాట్లాడుతూ కప్పలబంధం గ్రామంలో రైతులంత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కల్లాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇలా రైతులంత సమష్టిగా ముందుకు రావడం ఇతర గ్రామాల రైతులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తరుపున త్వరలో ఏర్పాటు కానున్న ధాన్యం కేంద్రాల్లో తమ ధాన్యాన్ని తరలించి మద్దతు ధరను పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకరచౌదరి, బీరవల్లి మాధవ్, భుక్యా శివకుమార్‌నాయక్, పెద్దబోయిన శ్రీనువాసరావు, కర్నాటి పిచ్చిరెడ్డి, శీలం నాగిరెడ్డి, వడ్రాణపు సత్యం, జాస్తి వెంకటేశ్వరరావు, జిల్లేళ్ల కృష్ణారెడ్డి, గుర్రాల నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం రాసి కల్లాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి